



APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు సంపుటి -1 సంచిక -97 పేజీలు-4 గురువారం 20 ఆగస్టు 2026 వెల4/-

## వర్ల రామయ్యకు లోకేష్ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీగా కూటమి ప్రభుత్వ వాణిని మరింత బలంగా వినిపించాలి



02

## బీసీలకు న్యాయంపై నిలదీసిన రాహుల్

◆జనగణనలో ఓబీసీ కాలమ్ ఎందుకు లేదు?

◆కేంద్రాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత

## గ్రూప్--1లో అక్రమాలపై అసెంబ్లీలో

# దుమారం

### గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్న చంద్రబాబు


◆అనర్హులతో మూల్యాంకనం..

◆ప్రైవేటు వ్యక్తులకు పేపర్లు.. నిబంధనలకు తూట్లు

◆ప్రజల భవిష్యత్తుతో ఆడుకున్నారని విమర్శ..

◆బాధ్యులపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధం

ఏపీపీఎస్సీ గ్రూప్--1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. అనర్హులతో జవాబు పత్రాలు దిద్దించడం, ప్రైవేటు వ్యక్తులకు పేపర్లు చేరవేయడం, ఓఎంఆర్ స్లిప్‌లలో మార్పులు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. యువత భవిష్యత్తుతో ఆడుకున్న ఈ వ్యవహారంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వివరాలు 2వ పేజీలో




02

## ఏలేరుకు జలభరోసా.. నిర్వాసితులకు పరిహారం

వెలిగొండకు రూ.200 కోట్లు.. ఏలేరు ఆయకట్టుకు రూ.25 కోట్లతో 548 పనులు

పోలవరం ఎడమ కాలువకు రెండేళ్లలో రూ.1,800 కోట్లు

వెలిగొండ నిర్వాసితులకు పరిహారం పంపిణీతో పాటు ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించింది. రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.



వివరాలు 2వ పేజీలో

## వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు

### త్యాగం మీది.. అండ మాది: చంద్రబాబు

4,157 కుటుంబాలకు ఇప్పటివరకు రూ.518 కోట్ల పరిహారం

మిగతా పరిహారం త్వరలోనే విడుదల

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే రూ.318 కోట్లు చెల్లించిన ప్రభుత్వం.. బుధవారం మరో రూ.200 కోట్ల పరిహారాన్ని అందించింది. దీంతో 4,157 కుటుంబాలకు ఇప్పటివరకు రూ.518 కోట్ల పరిహారం అందించినట్లైంది.

## స్థానిక పోరుకు సిద్ధం కండి

### వైకాపా శ్రేణులకు జగన్ పిలుపు

ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.



02

## టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

▶వాటిని అప్పుడే తెరిచేలా చేయకండి

▶తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు

02



## ఏ పి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



03

## 'స్వాప్ దానం'కు అవకాశం

శాసనసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

మంత్రి ప్రవేశపెట్టిన మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుకు సభ ఆమోదం


03



## ఈ నెలాఖరులో వెలుగొండ ద్వారా నల్లమల సాగర్ కి కృష్ణా జలాలు

ప్రాజెక్టు పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసిన ఘనత వైసిపి పార్టీదే

-మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



03

# బీసీలకు న్యాయంపై నిలదీసిన రాహుల్

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ, రక్షణ న్యూస్**

దేశంలో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం, హక్కులు కల్పించాలంటే సమగ్ర కులగణన అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కాలమ్‌లు ఉన్నప్పుడు ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో బుధవారం జరిగిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. బీసీలకు సమగ్ర కులగణన చేపడతామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఆ హామీకి అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కులాల వివరాలను నమోదు చేసేందుకు ఓపెన్ కాలమ్ విధానం ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీహార్, తెలంగాణలో నిర్వహించిన కులగణన తరహాలో దేశవ్యాప్తంగా కులాల వారీగా సమగ్ర జాబితా రూపొందించి, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ నంబర్ కేటాయించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. బీసీల జనాభా, సామాజిక–ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశ జనాభాలో బీసీలు గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ.. వారి జనాభాకు అనుగుణంగా అవకాశాలు, ప్రాతినిధ్యం దక్కడం లేదనే అంశాన్ని రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. కులగణన ద్వారా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, ఆ ఆధారంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీసీల సమస్యలను రాజకీయంగా మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోణంలో చూడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కులగణనపై మళ్లీ చర్చ...**రాహుల్‌గాంధీ వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా కులగణన అంశం మరోసారి రాజకీయ చర్చకు వచ్చింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, విద్యా––ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే కులాల వారీగా ఖచ్చితమైన గణాంకాలు అవసరమనే వాదనకు కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్రం అనుసరిస్తున్న విధానంపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 19: రక్షణ బ్యూరో:**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు సమీపిస్తున్న వేళ పరిహారం చెల్లింపులను వేగవంతం చేసింది. ఇప్పటికే రూ.318 కోట్ల పరిహారం అందించిన ప్రభుత్వం.. బుధవారం మరో రూ.200 కోట్లను విడుదల చేసింది. శాసనసభ ఆవరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని చంద్రబాబు తెలిపారు. మిగిలిన పరిహారం మొత్తాన్ని కూడా త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని పేర్కొంటూ.. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలను గుర్తించాలని కోరారు.

**4,157 కుటుంబాలకు పరిహారం...**వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న 2,557 కుటుంబాలకు ఓటీఎస్ కింద ఇప్పటికే రూ.318 కోట్ల పరిహారం చెల్లించారు. తాజాగా మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్ల పరిహారం అందించారు. దీంతో మొత్తం 4,157 కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం చెల్లించినట్లయింది.

**ఆరు కాలనీల్లో పనులు పూర్తి...**నిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న ఏడు పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన ఆరు కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయి. దీంతో నిర్వాసిత కుటుంబాలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలివెళ్తున్నాయి. ప్రభుత్వం పరిహారం అందించడంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. జూన్ 27న రూ.300 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించగా.. తాజాగా మరో రూ.200 కోట్లు విడుదల చేయడంతో వెలిగొండ నిర్వాసితులకు ఇప్పటివరకు అందిన మొత్తం పరిహారం రూ.518 కోట్లకు చేరింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

# వర్ల రామయ్యకు లోకేష్ శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 19: రక్షణ న్యూస్:**

గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్యకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య బుధవారం అసెంబ్లీలోని లోకేష్ ఛాంబర్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేష్‌కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, విజయాలను శాసనమండలిలో మరింత బలంగా వినిపించేలా పనిచేయాలని లోకేష్ సూచించారు. ప్రజా సమస్యలను మండలి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా వివరించాలని ఆకాంక్షించారు.

# టేబుల్‌పై డీఎంకె అవినీతి ఫైల్స్

మొదటి పేజీ తరువాయి



**చెన్నై,ఆగస్ట్19(:** ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# గ్రూప్––1లో అక్రమాలపై అసెంబ్లీలో దుమారం


మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 19: రక్షణ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్––1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో గత ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని విమర్శించారు. గ్రూప్––1 వంటి అత్యంత కీలకమైన నియామక ప్రక్రియలో నిబంధనలను పక్కనపెట్టి అనర్హులతో జవాబు పత్రాలు దిద్దించారని, ప్రైవేటు వ్యక్తులకు డిజిటల్ సమాచారాన్ని చేరవేశారని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద గ్రూప్––1 పరీక్షల అక్రమాలపై జరిగిన ప్రత్యేక చర్చలో చంద్రబాబు సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రభుత్వంలోని కీలక అధికారులను ఎంపిక చేసే పరీక్ష కావడంతో గ్రూప్––1 నియామకాల్లో అత్యంత పారదర్శకత, భద్రత అవసరమని అన్నారు. గత పాలనలో మాత్రం ఈ ప్రక్రియను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు.

**1.14 లక్షల మంది.. 325 మంది షార్ట్‌లిస్ట్...**2018లో జారీ చేసిన గ్రూప్––1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని చంద్రబాబు తెలిపారు. అందులో 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే అధికారుల ఎంపిక ప్రక్రియలో ప్రతి దశలోనూ కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా, నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారుకోర్టు ఆదేశాల తర్వాత కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. డిజిటల్ మూల్యాంకనానికి బదులుగా మాన్యువల్ మూల్యాంకనం చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ, కోర్టుకు సమర్పించిన అఫిడవిట్లలో వాస్తవాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు.

**హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం?...**కోర్టు ఆదేశాల తర్వాత హాయ్‌లాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల పనులకు ఉత్తర్వులు ఇచ్చారని చంద్రబాబు ఆరోపించారు. మరోవైపు అక్కడ మూల్యాంకనం జరగలేదని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారని పేర్కొన్నారు. జవాబు పత్రాలను ఏపీపీఎస్సీ స్ట్రాంగ్‌రూమ్ నుంచి అనధికారికంగా తరలించి 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో ఉంచారని ఆరోపించారు. మూల్యాంకన ప్రక్రియలో ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొనాల్సి ఉండగా.. ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, నిరుద్యోగులు, గృహిణులు



తదితరులకు జవాబు పత్రాలు దిద్దే బాధ్యతలు అప్పగించారని చంద్రబాబు పేర్కొన్నారు. 72 మంది మూల్యాంకనకర్తల్లో 25 మందిని అనధికారికంగా నియమించారని ఆరోపించారు.

**ప్రైవేటు ఈమెయిల్స్‌కు పేపర్లు...**గ్రూప్––1 జవాబు పత్రాలకు సంబంధించిన పీడీఎఫ్‌లను ప్రైవేటు జీమెయిల్ ఖాతాలు, గూగుల్ డ్రైవ్, వాట్సప్ ద్వారా పంపించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. మూల్యాంకన ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తుల ల్యాప్‌టాప్‌లకు చేరవేశారని తెలిపారు. నిబంధనల ప్రకారం ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి అవసరమైనప్పటికీ అది తీసుకోలేదని పేర్కొన్నారు.

మూల్యాంకనానికి 158 మంది ప్యానల్‌ను ఎంపిక చేసి, అందులో 72 మందికి ప్రక్రియ అప్పగించారని.. వారిలో 25 మంది వివరాలు కూడా స్పష్టంగా లేవని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే గ్రూప్––1 అధికారుల ఎంపికను ఆటగా మార్చారని తీవ్రంగా విమర్శించారు.

**734 ఓఎంఆర్ స్లిప్‌లలో 718లో మార్పులు...**కొత్త ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ మాన్యువల్ మూల్యాంకనానికి ఆదేశాలు ఇచ్చిన తర్వాత పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయని చంద్రబాబు తెలిపారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్‌లను ముద్రించినట్లు పేర్కొన్నారు. ఎగ్జామినర్ల జాబితాలను వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో పెట్టారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, మార్పులు, ఓవర్‌రైటింగ్స్ గుర్తించినట్లు చెప్పారు. 734 ఓఎంఆర్ స్లిప్‌లలో 718లో మార్పులు చోటుచేసుకున్నాయని, 21 స్లిప్‌లపై ఎలాంటి సంతకాలు కూడా లేవని తెలిపారు. గ్రూప్––1 పరీక్ష రాసిన ఓ అభ్యర్థినే మూల్యాంకన ఎగ్జామినర్‌గా నియమించారని ఆరోపించారు.

**17 రోజులు సీసీ కెమెరాలు లేవు...**జవాబు పత్రాలు దిద్దే హాల్లో 17 రోజులపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని చంద్రబాబు తెలిపారు. మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని ఆరోపించారు. పరీక్ష పత్రాల మూల్యాంకనంలో ఇంతటి నిర్లక్ష్యం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. వైటనర్ వినియోగించకూడదని ఏపీపీఎస్సీ నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ ఓఎంఆర్ మూల్యాంకన స్లిప్‌లలో వైటనర్ ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.

**కోర్టు జోక్యం.. త్రిసభ్య కమిటీ...**గ్రూప్––1 వ్యవహారంపై హైకోర్టు విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిందని చంద్రబాబు తెలిపారు. వెలుగులోకి వచ్చిన అంశాలన్నింటినీ సమగ్రంగా విశ్లేషించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తప్పు చేసిన వారు ఎప్పటికైనా దొరికిపోతారనడానికి ఏపీపీఎస్సీ గ్రూప్––1 వ్యవహారం ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణాల్లో ఇదొకటని ఆరోపించారు.

**వ్యవస్థలపై నమ్మకం దెబ్బతీశారు...**2019––24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని తాను అనేకసార్లు చెప్పానని చంద్రబాబు అన్నారు. ప్రజావేదిక కూల్చివేత నుంచి రాష్ట్ర బ్రాండ్ దెబ్బతినే వరకు అనేక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం లేకుండా గత పాలకులు వ్యవహరించారని ఆరోపించారు. ఏపీపీఎస్సీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలని, ఉద్యోగాల కోసం శ్రమించే యువత భవిష్యత్తుతో ఎవరూ ఆడుకోకూడదని అన్నారు. పరీక్షల్లో పేపర్లు లీక్ అయితే మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు గతంలో ఉన్నాయని గుర్తుచేశారు.

**వ్యక్తుల కోసం కాదు.. యువత కోసం వ్యవస్థ...**వ్యక్తుల కోసం వ్యవస్థలు పనిచేయకూడదని, యువత భవిష్యత్తు కోసం వ్యవస్థలు ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో మరింత పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తప్పు చేస్తే కఠినంగా శిక్ష పడుతుందన్న భయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జరిగిన అక్రమాలను విశ్లేషించి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తప్పు జరగలేదని చెప్పే ధైర్యం ఉంటే ప్రజల ముందు వివరించాలని సవాల్ చేశారు. రాజకీయంగా ఎదురుదాడులు, కుట్రలకే పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రూప్––1 పరీక్షల వ్యవహారంపై ప్రజలు, మేధావుల అభిప్రాయాలు కూడా తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ఠమైన సంస్కరణలు తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

# ఏలేరుకు జలభరోసా.. నిర్వాసితులకు పరిహారం

మొదటి పేజీ తరువాయి


**అమరావతి,రక్షణ బ్యూరో:**

వెలిగొండ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు వేగవంతం చేయడంతో పాటు ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వెలిగొండ నిర్వాసితులకు రెండో విడతగా రూ.200 కోట్లు పంపిణీ చేయగా.. ఏలేరు ఆయకట్టు పరిధిలో రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీలో వెల్లడించారు.

**నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు...**వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన 1,600 నిర్వాసిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం రూ.200 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించారు. ఇప్పటికే 2,560 కుటుంబాలకు రూ.318 కోట్లు చెల్లించారు. మిగిలిన అర్హులైన కుటుంబాలకు కూడా ఈ నెలలోనే పరిహారం అందించాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

నిర్వాసితుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు 11 గ్రామాల్లో 11 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు.

**ఏడు కాలనీల్లో వసతులు...**నిర్వాసితుల కోసం



నిర్మిస్తున్న ఏడు పునరావాస కాలనీల్లో నాలుగు కాలనీలకు సంబంధించిన మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన మూడు కాలనీల్లో పనులను రోజువారీగా సమీక్షిస్తూ వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు వెలిగొండను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు.

**ఏలేరుకు 950 క్యూసెక్కులు...**ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి అవసరాల కోసం ప్రస్తుతం 950 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నామని నిమ్మల తెలిపారు. ఇప్పటివరకు 2.6 టీఎంసీల నీటిని అందించామన్నారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఏలేరు రిజర్వాయర్ పరిధిలోని 53 వేల ఎకరాలతో పాటు పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు.

**పోలవరం ఎడమ కాలువకు రూ.1,800 కోట్లు...**కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పోలవరం ఎడమ కాలువ పనులకు రూ.1,800 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు.

**అక్రమ ఇసుక తవ్వకాలతో ఇబ్బందులు...**గత ఐదేళ్లలో ఏలేరు నదీగర్భంలో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా బెడ్ లెవల్ పడిపోయిందని, దీంతో గ్రావిటీ ద్వారా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వం ాడవీ పనులకు నిధులు విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 548 ాడవీ పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. మరో రూ.15.84 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

**రెండేళ్లలో వెలిగొండకు రూ.3,000 కోట్లు...**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నప్పటికీ వెలిగొండ ప్రాజెక్టుకు రెండేళ్లలో దాదాపు రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని నిమ్మల తెలిపారు. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రకాశం జిల్లాకు ప్రాధాన్యమివ్వాలన్న చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా పనులను వేగవంతం చేశామని చెప్పారు. 1996లో పునాది వేసిన వెలిగొండ ప్రాజెక్టు దాదాపు మూడు దశాబ్దాలుగా పూర్తికాకపోవడంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

# స్థానిక పోరుకు సిద్ధం కండి

మొదటి పేజీ తరువాయి

**తాడేపల్లి,రక్షణ బ్యూరో:**

రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైకాపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు.

**పోలీసులను ప్రయోగిస్తారు...**కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని జగన్ అన్నారు. ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని పేర్కొన్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనిపించకుండా చేసేందుకు పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, వాటన్నింటినీ ఎదుర్కొని ఎన్నికల సమరంలో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వైకాపాకు ప్రజల్లో ఆదరణ ఉందని, అందువల్ల ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం



ప్రజలతో మమేకమై వారి సమస్యలపై పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

**శాంతిభద్రతలపై విమర్శలు,,,**రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా దిగజారాయని జగన్ ఆరోపించారు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు కొనసాగుతున్నాయని, గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడిన ఘటనలు వ్యవస్థల పరిస్థితికి అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఆయా ఘటనల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంక హత్య ఘటనను ప్రస్తావిస్తూ.. ఆమెను కారుతో పలుమార్లు ఢీకొట్టి చంపారని, కేసు బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**హామీలు నెరవేర్చలేదని ఆరోపణ...**ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేదని జగన్ ఆరోపించారు. విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా ఏ వర్గమూ సంతోషంగా లేదన్నారు. రెండేళ్లలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని పేర్కొన్నారు. అదే సమయంలో వైకాపాపై ప్రజాదరణ పెరుగుతోందని చెప్పారు. గత ఐదేళ్ల వైకాపా పాలనను, ప్రస్తుత కూటమి పాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారని, ప్రతి ఇంట్లో దీనిపై చర్చ జరుగుతోందని అన్నారు.

**మరో ఏడాదిలో పాదయాత్ర...**మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని జగన్ తెలిపారు. ఆ తర్వాత ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైకాపాదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలను అందుకు తొలి అడుగుగా భావించి పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

26-5-26 rakshana main_Layout 1 8/20/2026 5:02 AM Page 3



# ఏ పి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు19 (:** ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం- 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడుతుం దన్నారు. అప్పిలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# ఈ నెలాఖరులో వెలుగొండ ద్వారా నల్లమల సాగర్ కి కృష్ణా జలాలు

**అమరావతి, ఆగస్టు 19 (:** వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. నేడు రెండో విడతగా మరో రూ. 200 కోట్లు అందజేశామన్నారు. మిగిలిన రూ. 400 కోట్లు నిర్వాసితులకు త్వరలోనే చెల్లించి ఈ నెలలోనే నల్లమల్ల సాగర్ కు నీరిస్తామన్నారు. వెలుగొండ నిర్వాసితులను వైసిపి పార్టీ దారుణంగా మోసగించిందని, పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందన్నారు. చెప్పినట్లే మార్కాపురం జిల్లా చేశామని, వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# 'స్వాప్ దానం'కు అవకాశం


మొదటి పేజీ తరువాయి




**అమరావతి, ఆగస్టు 19):** జీవన్మృతుల ( బ్రెయిన్‌డెడ్ ) వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.10,000 నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని మంత్రి తెలిపారు. 5,920 మంది నిరీక్షణరాష్ట్రంలో సుమారు 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పదేళ్లలోపు వయసున్న సుమారు 40 మంది పిల్లలు కూడా ఈ జాబితాలో ఉన్నారని వెల్లడించారు.

# దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే కొలెస్ట్రాల్‌పై ప్రభావం పడే ప్రమాదం.. హెచ్చరిస్తున్న నిపుణులు..

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాధారణంగా మారుతున్నాయి. అయితే వీటి ప్రభావం కేవలం మానసిక ఆరోగ్యంపైనే కాకుండా గుండె ఆరోగ్యంపైనా పడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒత్తిడి, అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె జబ్బులు, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ఒత్తిడిని నియంత్రించడంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టడం అవసరం. ఒత్తిడి కొలెస్ట్రాల్‌ను నేరుగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేసే ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందనలో భాగంగా పనిచేస్తాయి. అయితే ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఈ హార్మోన్ల ప్రభావం శరీరంలోని జీవక్రియలపై పడుతుంది.



## రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు..

దీర్ఘకాలిక ఒత్తిడి సమయంలో కార్టిసాల్ స్థాయిలు పెరగడం వల్ల కాలేయం మరింత గ్లూకోజ్‌ను తయారు చేయడంతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ఇవి శరీరానికి కొన్ని ముఖ్యమైన ప్రక్రియల్లో అవసరమైనప్పటికీ, ఎక్కువ కాలం స్థాయిలు అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి శరీరంలో స్వల్పస్థాయి వాపును కూడా పెంచే అవకాశం ఉంటుంది. నిరంతరం ఒత్తిడికి గురైనప్పుడు హార్మోన్లు, నాడీ వ్యవస్థకు సంబంధించిన కొన్ని మార్పులు ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లను ప్రభావితం చేస్తాయి. ఇవి గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సంబంధం కలిగి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒత్తిడి వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతోపాటు శరీరంలో నిల్వ ఉన్న కొవ్వులు రక్తప్రవాహంలోకి విడుదల కావడం కూడా పెరుగుతుంది. దీనివల్ల ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల దీర్ఘకాలిక ఒత్తిడిని కేవలం మానసిక సమస్యగా కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

## ఆహారపు అలవాట్లపైనా ఎఫెక్ట్..

ఒత్తిడి నేరుగా కొలెస్ట్రాల్‌పై ప్రభావం చూపడమే కాకుండా మన ఆహారపు అలవాట్లను కూడా మారుస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆకలి, కడుపు నిండిన భావనను నియంత్రించే హార్మోన్లలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా కొందరిలో భావోద్వేగాలకు అనుగుణంగా ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తీపి, కొవ్వు అధికంగా ఉన్న ఆహారాలపై కోరిక పెరగడం సాధారణం. తక్షణంగా ఆకలి లేదా ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్యాకేజ్డ్ స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, ఇతర అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ఆహారపు అలవాట్లు కొనసాగితే కొలెస్ట్రాల్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో కొందరిలో మద్యం తీసుకోవడం కూడా పెరుగుతుంది. అధిక మద్యం వినియోగం ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అదే విధంగా భోజన సమయాలు కూడా మారిపోతాయి. రాత్రివేళ ఆలస్యంగా ఎక్కువగా తినడం వల్ల అధిక కేలరీలు, సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్లు శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది.

## ఒత్తిడి, ఆహారం రెండింటి పాత్ర..

కొలెస్ట్రాల్ పెరగడంలో ఒత్తిడి, ఆహారం రెండింటికీ పాత్ర ఉంటుంది. కేవలం ఒత్తిడిని తగ్గించడం లేదా కేవలం ఆహారాన్ని మార్చడం మాత్రమే సరిపోదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఒత్తిడి నియంత్రణతోపాటు సమతుల్యమైన ఆహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. ఒత్తిడి కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుందని సూచించే కొన్ని సంకేతాల్లో తరచూ ఆందోళనగా అనిపించడం, రక్తపోటు, ఒత్తిడిలో ఎక్కువగా తినడం, నడుము చుట్టూ కొవ్వు పెరగడం, నిద్ర సరిగా లేకపోవడం, అలసట, సాధారణ ఆరోగ్య పరీక్షల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వంటివి ఉంటాయి. అయితే ఈ లక్షణాలు ఇతర కారణాల వల్ల కూడా వస్తాయని గుర్తుంచుకోవాలి. ఒత్తిడితోపాటు కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర నాణ్యతను మెరుగుపరచడం, ధ్యానం లేదా మైండ్‌ఫుల్‌నెస్ వంటి పద్ధతులను పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండడమే కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం ద్వారా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు.

## ఏం చేయాలి..

కొలెస్ట్రాల్‌ను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు ఓట్స్, బార్లీ, బీన్స్, పప్పులు, గింజలు, కొవ్వు అధికంగా ఉండే చేపలు, కరిగే పీచు పదార్థం ఎక్కువగా ఉన్న పండ్లు, విత్తనాలు, కూరగాయలు, ఆలివ్ ఆయిల్ వంటి ఆహారాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం గుండె ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ పరీక్షల్లో చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు పదేపదే అధికంగా వస్తుంటే వైద్యులని సంప్రదించడం అవసరం. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు, రక్తపోటు ఉన్నవారు, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే దీర్ఘకాలిక ఒత్తిడి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే దాన్ని నియంత్రించేందుకు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఒత్తిడి, ఆహారపు అలవాట్లు రెండూ కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే మార్గాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడిని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షల్లో తేలితే కారణాన్ని గుర్తించి సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిది.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..

మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.



## ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

## ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

26–5-26 rakshana main_Layout 1 8/20/2026 5:02 AM Page 4



# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సింపుల్ చీరలోనే సెన్సేషన్.. అలేఖ్య హారిక లుక్స్‌కు ఫ్యాన్స్ ఫిదా!

దేత్తడి' హారికగా అందరికీ సుపరిచితురాలైన నటి, యూట్యూబర్ అలేఖ్య హారిక తన కొత్త ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. తాజాగా ఆమె తెలుపు రంగు చీరలో బెడ్‌పై రిలాక్స్ అవుతూ దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. చాలా సింపుల్‌గా, ఎంతో క్యూట్‌గా ఉన్న ఆమె లుక్ చూసి నెటిజన్లు మెస్మరైజ్ అవుతున్నారు. సాంప్రదాయ దుస్తుల్లోనూ తనదైన గ్లామర్, హాట్‌నెస్‌ని జోడించి హారిక చేసిన ఈ హంగామా ప్రస్తుతం నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో అలేఖ్య హారిక తెలుపు రంగు చీర ధరించి ఎంతో ముచ్చటగా కనిపించింది. బెడ్‌పై పడుకుని చిరునవ్వులు చిందిస్తూ ఆమె ఇచ్చిన పోజులు చాలా కోజీగా, ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇక సింపుల్ మేకప్, కాజువల్ లుక్‌లోనే తన పరువాలు ఆరబోస్తూ ఆమె చేసిన ఈ ఫొటోషూట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. హారిక పంచుకున్న ఈ పిక్స్ చూసి అభిమానులు కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. "చార్మింగ్", "సూపర్బ్ డియర్", "క్యూట్" అంటూ రకరకాల కామెంట్లతో కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. ఫొటోలు పోస్ట్ చేసిన కొద్దిసేపట్లోనే వేలాది లైకులు రాగా, ఫ్యాన్స్ ఈ పిక్స్‌ను తెగ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.





# శ్రీలీల లేటెస్ట్ ట్రెడిషనల్ లుక్ వైరల్.. గ్రేస్‌తో మెస్మరైజ్

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జెటిక్ బ్యూటీ శ్రీలీల తన సరికొత్త ట్రెడిషనల్ లుక్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. రాయల్ అండ్ ఫెస్టివ్ వైబ్‌తో పంచుకున్న ఈ ఫొటోషూట్‌లో ఆమె దేవకన్యలా మెరిసిపోతూ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ట్రెడిషనల్ వేర్‌లో శ్రీలీల చూపించిన గ్రేస్, ఆమె అమాయకమైన చూపులు కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోషూట్‌లో శ్రీలీల క్రీమ్ అండ్ ఐవరీ గోల్డ్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న ఎక్స్‌క్లూజివ్ సాంప్రదాయ దుస్తులను ధరించారు. ఇందులో బంగారు పూల జరీ వర్క్, పింక్ అండ్ గ్రీన్ కలర్ జియోమెట్రిక్ బోర్డర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దానికి మ్యాచింగ్ సీక్విన్ వర్క్ ఉన్న నెట్ దుపట్టా, రాయల్ జ్యువెలరీ, చోకర్, బుట్టలు మరియు పాపిడి బిళ్ళతో ఆమె మహారాణిలా కనిపిస్తున్నారు. తన లేటెస్ట్ ఫొటోషూట్ పిక్స్‌ను షేర్ చేస్తూ శ్రీలీల ఒక మంచి అర్థవంతమైన క్యాప్షన్ జోడించారు. ""మనసు చెప్పిన బాటలో మనం ప్రయాణించినప్పుడు.." అంటూ ఆమె షేర్ చేసిన క్యాప్షన్ అభిమానుల హృదయాలను గెలుచుకుంది.. తెల్లటి పరదాల నేపథ్యంలో ఆమె ఇచ్చిన పోజులు, చిరునవ్వులు నెటిజన్లను విపరీతంగా అలరిస్తున్నాయి.

# యువతితో దొరికిపోయిన ఈశ్వర్ సాయి

జానపద గేయాల్లో నటించే కళాకారుడు ఈశ్వర్ సాయి ఓ యువతితో ఏకాంతంగా గడుపుతూ భార్యకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అతడి భార్య మంగళవారం అర్ధరాత్రి తన బంధువులతో వచ్చి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తనను వదిలేసి పరాయి యువతితో ఎందుకు తిరుగుతున్నావని, నా బతుకు ఏంచేద్దాం అనుకుంటున్నావని ఈశ్వర్ సాయిని అతడి భార్య నిలదీసింది. కాగా ఈశ్వర్ సాయి, అతడితో పట్టుబడిన యువతి ఇటీవల జానపద పాటలో ముఖ్య పాత్రలు పోషించారు. ఆ పరిచయమే వాళ్లను దగ్గర చేసింది. ఇక 'బాసింగ బాసింగా బలాలే' పాట ఈశ్వర్ సాయికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఈశ్వర్ సాయి యువతితో పట్టుబడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్‌ల నుంచి రకరకాల కామెంట్లు వస్తున్నాయి.





Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District